క్లుప్తంగా

యోగా ఉచిత శిక్షణ ప్రారంభం



ఉచిత యోగా శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పీఎం పాలెం: వేసవి సెలవులను పురస్కరించుకుని పీఎం పాలెంలోని మూడు పార్కుల్లో యోగా ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు స్థానిక యోగా శిక్షకుడు జొన్నల నాగిరెడ్డి తెలిపారు. మానసిక ప్రశాంతతకు, శారీరక దారుఢ్యానికి యోగాభ్యాసం ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. స్థానిక తులసీ నగర్ పార్కు, ఎస్‌బీఐ లే అవుట్ పార్కు, హెచ్‌పీసీఎల్ పార్కుల్లో ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల 3 నుంచి 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 77027 66718 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం



అమనాంలో కాలిపోయిన పూరిల్లు

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కర్రి నారాయణమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బాధితురాలికి రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు తెలిసింది. ఇందులో నివసిస్తున్నవారికి ఎలాంటి హాని జరగలేదు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

విద్యార్థుల పుస్తకాలకు రూ.12వేల ఆర్థిక సాయం



పుస్తకాలతో విష్ణువర్ధన్, శశిధర్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు గ్రంథాలయ వీధికి చెందిన 5,7 తరగతుల విద్యార్థులు విష్ణువర్ధన్, శశిధర్‌కు ఆర్థిక సహాయం అందించారు అక్కయ్యపాలెం శ్రీనిధి అసోసియేట్స్‌కు చెందిన చిరికి సంతోష్‌కుమార్. వారి పుస్తకాల నిమిత్తం శుక్రవారం రూ.12వేలు అందించారు. విద్యార్థుల తండ్రి ఏలూరు రాంబాబు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. విద్యార్థులు బ్యాంక్ కాలనీలోని పాఠశాలలో చదువుతున్నారు.

ప్రతి శుక్రవారం అన్నప్రసాదం



దుర్గాలమ్మ ఆలయంలో అన్న ప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో ప్రతి శుక్రవారం భక్తులు, దాతల సహాయ సహకారాలతో 100మంది వరకు పేదలు, భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి శుక్రవారం ఆలయ ఆవరణలో అమ్మవారికి నివేదించిన ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. పీఎం పాలేనికి చెందిన శ్రీ బోర్‌వెల్ అధినేత బి.ధనుంజయం, సంధ్యారాణి కుటుంబ సభ్యుల సహకారంతో 200 మందికి అన్నప్రసాదం అందించారు. ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇష్టానుసారం కరెంటు కోతలు

మధురవాడ: పీఎం పాలెం, కొమ్మాది సబ్‌స్టేషన్ల పరిధిలో అప్రకటిత విద్యుత్ కోతలతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీఎం పాలెం సబ్ స్టేషన్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. నిర్వహణ పనులు చేపట్టినప్పుడు కూడా సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం ఉదయం రెండు గంటలకు పైగా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఆపేశారు. రాత్రివేళల్లో అయితే, రెండు మూడు గంటలు చొప్పున తరచూ కరెంటు కోతలు విధిస్తున్నారు. వీరి తీరుపై ప్రతిపక్ష పార్టీలతో పాటు అధికార పక్షానికి చెందిన వారు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినా మార్పు రాలేదు. దీనిపై జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఇటువంటివి భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.



కొంతమేర వేసిన బీటీ రోడ్డు



అసంపూర్ణంగా ఉన్న సర్వీసు రోడ్డు

ఏడాదిగా.. అసంపూర్తిగానే..

వైఎస్సార్‌సీపీ హయాంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం ప్రారంభం

- ఎన్నికలు రావడంతో నిలిచిన పనులు
- దృష్టి సారించని కూటమి ప్రభుత్వం
- 700 మీటర్ల ప్రయాణం నరకప్రాయం
- ప్రయాణికుల అవస్థలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఎండాడ కూడలి నుంచి పెట్రోల్ బంకు వరకు ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం అసంపూర్ణంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎండాడ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ ప్రాంతంలో నిర్మాణాలు ఊపందుకున్నాయి. మరోవైపు విశ్వవిద్యాలయాలు, ఐటీ కంపెనీలు, కళాశాలలు ఉండటంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎక్కువే. ఈ నేపథ్యంలో ఎండాడ డబుల్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు ఎండాడ కూడలి నుంచి ఎండాడ జాతీయ రహదారిపైకి నేరుగా వెళ్లడంతో ఈ కూడలిలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇది దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం ఎండాడ కూడలి నుంచి ఎండాడ చెరువును ఆనుకుని ఉన్న పెట్రోల్ బంకు వరకు బీటీ రోడ్డు ప్రతిపాదన చేసింది. వెనువెంటనే పనులు ప్రారంభించి 300 మీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మించింది. ఈ క్రమంలో ఎన్నికలు రావడంతో ఇక్కడ పనులు నిలిచిపోయాయి. ఎండాడ కూడలి నుంచి చెరువును ఆనుకున్న పెట్రోల్ బంకు వరకు కిలోమీటరు సర్వీసు రోడ్డు వేయాల్సి ఉండగా అందులో 300 మీటర్లు మేర పనులు పూర్తి కాగా.. మిగిలిన 700 మీటర్ల పనులు అసంపూర్ణంగా నిలిచిపోయాయి.

అసంపూర్ణంగా ఉన్న 700 మీటర్ల సర్వీసు రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయల వరకు అవసరం ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఇక్కడ పనులు ప్రారంభం కాలేదు. పాలకులు, అధికారులు ఇప్పటి వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవడంతో స్థానికుల నుంచి భారీ స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనవసరం అయిన చోట రహదారులు నిర్మిస్తున్నారని, అవసరమైన సరీసు రోడ్డుకు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ వెతలు

ఎండాడ కూడలి నుంచి ఈ బంక్ వరకు **మధ్యలో అనేక కొత్త** కాలనీలు, పలు గృహ **సముదాయాలు** ఏర్పడటంతో వాహనాల **రాకపోకలు భారీగా** పెరిగాయి. మట్టి రోడ్డు **కావడం, పనులు అ**సంపూర్ణంగా ఉండటంతో **వాహనదారులు తరచూ** ప్రమాదాల బారిన **పడుతున్నారు. అలానే** మట్టిరోడ్డు కారణంగా **దుమ్ము, ధూళి ఎగరటం**తో వాహనదారులతో **పాటు ఇటుగా వెళ్లే**వారు తీవ్ర ఇబ్బందులు **ఎదుర్కొంటున్నారు.** అంతేకాదు ఈ రోడ్డులో **వాహనాల పార్కింగ్** అనుమతులు లేకుండా **అనేక మెకానిక్ షెడ్‌**లు ఉండటంతో నిత్యం **ట్రాఫిక్ సమస్య తీవ్రత**రం అవుతోంది.



ప్రయాణం సులభతరం అవుతుంది



ఎండాడలో ఉదయం, సాయంత్రం రద్దీ చాలా ఎక్కువ. ఆ సమయంలో ఎండాడ నుంచి బంక్ వరకు వెళ్లాలంటే జాతీయ రహదారిపై నుంచే వెళ్లాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంటోంది. సర్వీస్ రోడ్డు పూర్తయితే అందరికీ ఎంతో సులువుగా ఉంటుంది. ప్రయాణికులు, స్థానికుల అవసరాలు గుర్తించి త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి. –దువ్వి వాసు, ఎండాడ

అటుగా వెళ్లాలంటే భయం



జాతీయ రహదారి నుంచి ప్రయాణించాలంటే ట్రాఫిక్ సమస్య. సర్వీసు రోడ్డు నుంచి వెళ్దామంటే ఒళ్లు హూనమవుతోంది. ఇక్కడ పూర్తి స్థాయిలో రోడ్డు లేకపోవడంతో ఉన్న కాస్త రోడ్డు కూడా నిరుపయోగంగా మారుతోంది. జనాలకు అవసరమైన చోట రోడ్డు ఏర్పాటు చేయకపోతే ఎలా? – అల్లూరి పార్వతి, ఎండాడ

పార్కులో అక్రమ నిర్మాణం తొలగింపు



పీఎం పాలెం అశోక్ నగర్ పార్కులో తొలగించిన నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం అశోక్‌నగర్ లుంబినీ పార్కు ప్రహరీని విరగ్గొట్టి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఇక్కడ సుమారు రూ.40లక్షలు విలువ చేసే 50గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రైవేట్ వ్యక్తులు షెడ్డు నిర్మిస్తున్నారు. అయినా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోలేదు. స్థానికులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో 'పార్కులో అక్రమ నిర్మాణం' శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైనంది. దీనిపై జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది షెడ్‌ను తొలగించారు.

మినీగోకులం షెడ్ల బిల్లుల చెల్లింపునకు వినతి

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులం షెడ్ల బిల్లులు చెల్లించాలని కోరుతూ భీమిలి మండల రైతులు శుక్రవారం నగరంలోని డ్వామా పీడీ కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు. నిబంధనల ప్రకారం 40 మందికి పైగా రైతులు మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మండలానికి చెందిన నీలాపు సూర్యనారాయణరెడ్డి, గాడు తాతినాయుడు, మజ్జి వెంకటరావు ఉన్నారు.

చురుగ్గా ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. అందులో భాగంగా శుక్రవారం జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి గీత ఆధ్వర్యంలో అధికారులు పలు గ్రామాలకు వెళ్లారు. ఆమె మాట్లాడుతూ మానసికంగా ఎదుగుదల లేని ఒకటి నుంచి 18 సంవత్సరాల వయసున్న పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇలా గుర్తించిన పిల్లలను వారి పరిస్థితిని బట్టి దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. వీరికి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, దాంతో పాటు తగినమేరకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలియజేశారు. శుక్రవారం మూలకుద్దు గ్రామంలో ఇద్దరిని గుర్తించామని తెలిపారు. వీరితోపాటు ఇప్పటికే మండల పరిధిలో ఆరుగురిని గుర్తించామన్నారు.



మూలకుద్దు వద్ద పిల్లలను గుర్తించే కార్యక్రమంలో అధికారులు

ఇలాంటి పిల్లలు ఎక్కడైనా ఉంటే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో, మూలకుద్దు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దాలయ్యబాబు, భవిత కేంద్ర ఉపాధ్యాయులు కేజియా కుమారి, పార్వతి పాల్గొన్నారు.

నత్తనడకన భూగర్భ విద్యుత్ పనులు

పీఎం పాలెం: వుడాకాలనీలో ఇటీవల భూగర్భ విద్యుత్ పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో పలు చోట్ల రోడ్డు వెంబడి కాలువలు తవ్వారు. తవ్వగా వచ్చిన మట్టిని రోడ్డు అంచున పోగులుగా వేయడంతో చిన్న వర్షం పడినా మట్టి కరిగి రోడ్డు మీదకు వస్తోంది. ఆ సమయంలో రోడ్డు మీద ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ వైరింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



వుడాకాలనీలో రోడ్డు వారగా ఉన్న మట్టి పోగులు

మామిడి పంట ఆదాయంలో హెచ్చుతగ్గులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో మామిడి పంట ద్వారా వచ్చే ఆదాయంలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఒక ఏడాది పంట దిగుబడి బాగుంటే.. మరుసటి ఏడాది పంట తగ్గిపోతోంది. పంట దిగుబడిలో మార్పుల వల్ల జైలుకు వచ్చే ఆదాయంలో కూడా హెచ్చుతగ్గులు వస్తున్నాయి. జైలు ఆవరణలో పండిన మామిడి పంటను అధికారులు ఏటా వేలం వేస్తుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది వేలం పాట నిర్వహించగా.. ఓ వ్యాపారి రూ.1.30 లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.50వేలు అధికంగా ఆదాయం లభించింది. జైలు ఆవరణలోని మామిడి తోట నుంచి 2020లో రూ.65 వేల ఆదాయం లభించగా, 2021లో రూ.1,00,200, 2022లో రూ.52వేలు, 2023లో రూ.1.40లక్షలు, 2024లో రూ.80 వేలు, 2025లో రూ.1.30లక్షలు ఆదాయం వచ్చింది. ఇలా గత ఆరేళ్లలో ఒక సంవత్సరం ఆదాయం తగ్గడం, మరుసటి సంవత్సరం పెరగడం గమనార్హం.



విశాఖ కేంద్ర కారాగారంలో మామిడి తోట

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏడాదిలోగా సొంత భవనం

తగరపువలస: ప్రస్తుతం చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలో కేజీబీవీ కోసం నిర్మించిన భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏడాదిలోగా ఆనందపురంలో సొంత భవనం రానుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ ఆదేశాలు జారీ చేశారు. పీఎం ఉషా పథకం కింద రూ.4.50 కోట్లతో ఆనందపురం పంచాయతీల సర్వే నంబర్ 276లోని 5 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించనున్నారు. నిధులు మంజూరై ప్రభుత్వ స్థలం లభించని పరిస్థితులలో ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి చొరవ తీసుకుని కలెక్టర్ హరేందిరప్రసాద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుల దృష్టికి తీసుకు వెళ్లారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు మొదలు పెట్టనున్నారు. అనంతరం మొదటి 4 నెలల్లో 30 శాతం, 8 నెలల్లో 70 శాతం, ఏడాదిలోగా నూరుశాతం నిర్మాణం పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు సూచించారు.

18న తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ ప్రదర్శన

మద్దిలపాలెం: తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ ప్రదర్శన, 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల పోటీల బహుమతి ప్రదానోత్సవాన్ని ఈ నెల 18న కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి వై.ఎస్.కె.ఎస్. స్వామి తెలిపారు. ఈ సందర్భంగా 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత' అనే నాటిక 50వ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది నిర్వహించిన 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల పోటీలకు విశేష స్పందన వచ్చిందని.. ఉత్తమ రచనగా 'రిక్వెస్ట్', ద్వితీయ ఉత్తమ రచనగా 'క్రతువు', తృతీయ ఉత్తమ రచనగా 'మూగబోయిన సాక్ష్యం' ఎంపికైనట్లు వెల్లడించారు. 'విష కుంభం', 'భుని కోరని భ్రమణం' నాటికలు జూరీ బహుమతులు గెలుచుకున్నట్లు చెప్పారు. తెలుగు నాటకరంగ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై.. బహుమతి ప్రదానోత్సవంతోపాటు కళాకారు లు జ్ఞాపికలు ప్రదానం చేస్తామన్నారు. రావులపాలేనికి చెందిన డాక్టర్ గొలుగూరి విక్టరీ వెంకట్ రెడ్డికి ప్రత్యేక పురస్కారం అందజేస్తామని స్వామి వివరించారు.

మద్దిలో అగ్ని ప్రమాదం

పద్మనాభం: మండలంలోని మద్దిలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.50వేలు ఆస్తి నష్టం వాటిల్లింది. చేమన్న గారి కళ్లాల్లో బుగత అప్పలనాయుడుకు చెందిన పశువుల శాల, పందిరి, ఒక గడ్డివాము దగ్ధమయ్యాయి. వ్యవసాయ పంపుసెట్ల విద్యుత్ లైన్ తెగి గడ్డి వాముపై పడడంతో ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. గ్రామంలోకి మంటలు కనిపించడంతో స్థానికులు ఈ కళ్లాల వద్దకు పరుగులు తీసి పశువుల పాకలో ఉన్న పశువులను విప్పి పైకి వదిలేయడంతో వీటికి ప్రాణనష్టం తప్పింది.



మద్దిలో దగ్ధమవుతున్న పశువుల పాకలు

ఏ వీధి చూసినా..

ఇంటి పేరు కస్తూరీవారు.. ఇంట్లో గబ్బిలాల కంపు అన్న చందంగా ఉంది జీవీఎంసీలోని భీమిలి జోన్ పరిస్థితి. భీమిలిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామంటూ ప్రజా ప్రతినిధులు ఊదరగొడుతుండగా.. అధికారగణం పనితీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. వీధుల్లో అపారిశుధ్యం రోడ్లపై పశువులు, మురికి గుంటల్లో పొర్లుతున్న పందులే ఇందుకు నిదర్శనం.

\- తగరపువలస

- రోడ్లపై పశువులు
- మురుగులో పందులు
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రస్తుతం భీమిలి కేంద్రంగా చుట్టుపక్కల వందల సంఖ్యలో విద్యాసంస్థలు వెలియడంతో వాటికి సరిపడా ప్రైవేట్ హాస్టళ్లు కూడా పుట్టుకు వస్తున్నాయి. జోన్‌లో నిత్యం ఉదయం వేళ ఇంటింటా వాహనాలతో చెత్త సేకరణ జరుగుతున్నా.. హాస్టల్ యజమానులు మాత్రం వీరికి సహకరించరు. ఆహార, కూరగాయల వ్యర్థాలను ఆరుబయటే పడేస్తుండటంతో 2వ వార్డు సంగివలస, ఉళ్లపేట, ఇడదాసరిపేట, నమ్మివానిపేట, కోరాడపేట గ్రామాలలో వందల సంఖ్యలో పందులు, కుక్కలు తిష్ట వేస్తున్నాయి. ఇవి పరిసరాలతో పాటు డ్రైనేజీలను తవ్వి పోస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్నారు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు.



ఉళ్లపేట మార్గంలో గలీజు వాతావరణం

రోడ్లమీదే పశువులు

ఇక భీమిలి, తగరపువలస ప్రధాన రహదారులలో వందల సంఖ్యలో పశువులు రోడ్లమీదే పడకేస్తున్నాయి. వందల సంఖ్యలో పారిశుధ్య, టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది ఉన్నా ప్రజాజీవనానికి ఆటంకం కలిగిస్తున్న పశువులను కట్టడి చేయలేకపోతున్నారు. ఈ పశువులు పగలు రాత్రి తేడా లేకుండా స్పీడ్ బ్రేకర్లుగా ఉంటూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. చాలాసార్లు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. భీమిలి అభివృద్ధిలో విశాఖ మహానగరంతో పోటీ పడుతున్నట్టు చెబుతున్నా రోడ్లపై, వీధులలో పశువుల సంచారం కారణంగా స్థానికులు పర్యాటకులు విసిగిపోతున్నారు, మరోవైపు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటిని అరికట్టి అభివృద్ధి ఊసు ఎత్తాలని వీరంటున్నారు.



ఉళ్లపేట ప్రైవేట్ హాస్టళ్ల బయట పందుల గుంపు



బ్యాంకు కాలనీలోని భీమిలి రోడ్డుపై పశువులు

మురుగు కూపంలా ఎన్టీఆర్ కాలనీ




రోడ్డుపై పారుతున్న మురుగు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలనీలో ఎటుచూసినా మురుగునీరే కనిపిస్తోంది. నడిచి వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా వీధుల్లో మురుగు నిలిచిపోయింది. ఇక్కడి బోరుబావికి ప్లాట్‌ఫాం లేకపోవడంతో చుట్టూ మడుగు తయారైంది. మురుగు నీరు వెళ్లే పైపులు మురుగులో మునిగి తేలుతున్నాయి. దీంతో దోమలు, పందులు, కుక్కలు సరేసరి. దీంతో ప్రతి ఇంట్లో పేషెంట్లు తయారై ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బులు వదిలించుకున్నారు. కనీసం ఇళ్ల చుట్టూ తుప్పలు తొలగించి, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. మురుగునీరు బయటికి పంపించే ఏర్పాటు చేసి, గ్రావెల్‌తో గోతులు పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బోరుబావి పరిస్థితి ఇదీ..



మురుగులో ప్లంబింగ్ పైపులు



నివాసాల మధ్య నిలిచిన మురుగు